క్లుప్తంగా

ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్టివల్'



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా హర్యానా రాష్ట్ర ప్రత్యేక వంటకాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల వంటకాలను వండి, వాటి ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమానికి మూడపల్లి ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లేశం హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు వనిత, శ్రీధర్, రాజు, రమేశ్, హరిక, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు పూర్తిచేయాలి



ఇల్లంతకుంట: రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన ఎల్ఎం6 కాలువ పనులు పూర్తి చేయాలని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, మండలాల బీజేపీ అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్, వెన్నమనేని శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం పెద్ద లింగాపూర్‌లో రైతులు చేస్తున్న రిలే దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఇక్కడ నాయకులు ఇటికల రాజు, నాగుల శ్రీనివాస్, దండవేని రజినికాంత్, అమ్ముల అశోక్, కమలాకర్, పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు.

దీక్ష విరమించండి

ఇల్లంతకుంట: రైతులు రిలే నిరాహార దీక్షలు విరమించాలని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అసంపూర్తి కాలువ పనులకు నిధులు మంజూరయ్యేలా చూస్తారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వెంకటి, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం దీక్ష శిబిరాన్ని వారు సందర్శించారు.

వరి పొలాల పరిశీలన



వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు కంచర్ల గ్రామాల్లో వరి పొలాలను జిల్లా ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్) కరీంనగర్ కోఆర్డినేటర్ డా.కె.మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డా.ఎం.రాజేంద్రప్రసాద్ మండల వ్యవసాయ అధికారి జయ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి దీపిక రైతులు పాల్గొన్నారు.

మర్లపేటలో

బోయినపల్లి: మండలంలోని మర్లపేట రైతుల వరి పొలాలను జిల్లా ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్) కరీంనగర్ కో ఆర్డినేటర్ కే.మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంగళవారం సందర్శించారు.యాసంగి సీజన్ వరిపంట పొలాల్లో కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు లక్షణాలు గమనించి వాటి నివారణ పద్ధతులు, పిచికారీ చేయాల్సిన మందులు సూచించారు. ఎంఏవో ప్రణీత, గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి, ఏఈవో జ్యోతిరెడ్డి మంగళవారం పెద్ద లింగాపూర్ రామాజీపేట గ్రామాల్లో పంటలను పరిశీలించారు. పెద్ద లింగాపూర్‌లో రైతులు గాదె మహేశ్, మధుసూదన్ పొలాలు, రామాజీపేటలోని ఎద్దు రాజు పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు

నిరసన

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం జరిగేంత వరకు గ్రూప్1, 2, 3 లతోపాటు అన్ని రకాల ఫలితాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మల్యాల లచ్చన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాదిన్నర జైలు

సిరిసిల్లకల్చరల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. 2016లో సిరిసిల్లకు చెందిన రామినేని శశిరాజారావు రూ.5లక్షలు అప్పుగా తీసుకుని కోడం నరేశ్‌కు చెక్కు ఇచ్చాడు. గడువులోపు చెక్కు చెల్లకపోవడంతో బ్యాంక్ అధికారులు తిప్పి పంపించారు. దీంతో బాధితుడు కోర్టులో దావా వేశాడు. విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడు శశిరాజారావుకు జైలు శిక్షతో పాటు రూ.7.5లక్షలు ప్రతివాదికి చెల్లించాలంటూ తీర్పు చెప్పారు.

రోడ్డుపై పైపులు.. రాకపోకలకు తిప్పలు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో ప్రధాన రహదారిపై పైపులు ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గ్రామంలో రహదారి పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మించేందుకు సిమెంట్ పైపులు తెచ్చి రోడ్డుపై ఉంచారు. ఏళ్లు గడుస్తున్నా పనులు జరుగడం లేదు. పైపులు తీయడంలేదు. దీంతో ప్రతిరోజూ వచ్చేపోయే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులను రోడ్డుపై నుంచి తొలగించి రవాణాకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.





కోడ్ ముగిసినా.. ముసుగు తొలగలే !

ముస్తాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా దేశ నాయకులపై వేసిన ముసుగులు మాత్రం తొలగడం లేదు. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి ఫలితాలు కూడా వెల్లడించారు. అయినా మండలంలోని పోతుగల్ గ్రామంలో ఇందిరాగాంధీ విగ్రహంపై వేసిన ముసుగును అధికారులు ఇప్పటివరకు తొలగించలేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



ఘనంగా మడేలేశ్వర బోనాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో రజకసంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కులస్తుల ఆధ్వర్యంలో మహిళలు ఇంటికో బోనంతో తరలివెళ్లారు. పోతరాజుల విన్యాసాలు, బైండ్లవాళ్ల పూజలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రజకసంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దూరు సాలయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలి పెంచాలి



బోయినపల్లి: ఉపాధిహామీ కూలి రేట్లు పెంచాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని రామన్నపేటలో ఉపాధిహామీ కూలీలతో కలిసి మంగళవారం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ బడ్జెట్ పెంచడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధిహామీ కూలీల రేట్లు పెంచాలని కోరారు. ఉపాధిహామీ కూలీలు కొత్తకొండ మల్లేశం, శ్రీను, గడ్డం సత్యరెడ్డి, ప్రభాకర్, మంథని లచ్చవ్వ, సామ కవిత, లావణ్య, వెంకవ్వ తదితరులు ఉన్నారు.

సన్మానం



రంజిత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న రంజిత్ గ్రూప్ 2 పరీక్ష ఫలితాల్లో 56 ర్యాంక్ సాధించడంతో కళాశాల బృందం ఆయనను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక



నజీర్‌కు నియామకపత్రం అందిస్తున్న ఫౌండర్

కోనరావుపేట: మండల యువచైతన్య దీపం ఫౌండేషన్ మైనారిటీ అధ్యక్షుడిగా బావుసాయిపేటకు చెందిన షేక్ నజీర్‌ను, కోనరావుపేట మైనారిటీ ఇన్‌చార్జిగా సయ్యద్ సాబీర్ నియమించినట్లు ఫౌండర్ శేఖర్ సేనాపతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు.

కళ్లద్దాలు పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. వేములవాడ మహాత్మా జ్యోతిరావుపూలే, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదివే విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డా.కె.ప్రభాకర్, డా.జె.అభియన్‌రాణి, సంధ్యారాణి, దివ్య, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, సూపర్‌వైజర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్‌లోని కస్తూర్బా టగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు ప్రమోద, గౌస్ బాషా, సిబ్బంది అర్చన, రేణుక, స్పెషల్ ఆఫీసర్ శ్యామల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

కోనరావుపేట: మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేసేంతవరకు గ్రూప్–1, గ్రూప్–2 ఫలితాలను నిలిపివేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము రాజశేఖర్, కుమ్మరి దిలీప్‌కుమార్, దేవరాజు, ప్రభాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• **చికిత్స పొందుతూ మృతి**

చందుర్తి: నాలుగు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్యాల గ్రామానికి చెందిన పోతురాజు గంగాధర్ (44) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన పోతురాజు గంగాధర్ పని నిమిత్తం చందుర్తి మండలకేంద్రానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, సనుగుల గ్రామానికి చెందిన శివరాత్రి రమేశ్ చందుర్తికి వెళ్తున్నాడు. మల్యాల గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. గాయపడ్డ పోతురాజు గంగాధర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

• **వేతనాలు పెంచాలి**

ముస్తాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కూల్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని కోరుతూ ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలకు డ్రైవర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ నెలకు రూ.18వేల వేతనాన్ని ఇవ్వాలన్నారు. నెలలో రెండురోజులు సెలవులు ఇవ్వాలని, తాత్కాలిక డ్రైవర్లకు అదనపు వేతనం చెల్లించాలని కోరారు. వేసవి సెలవుల్లో సగం వేతనం ఇస్తూ, ఏడాదికి రెండు జతల యూనిఫామ్స్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. డ్రైవర్ల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు వహిద్, షాదుల్, బండి ప్రశాంత్ తదితరులున్నారు.

• **బోర్‌వెల్ రీచార్జ్ పనులు పరిశీలన**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కోనేటి లక్ష్మి వ్యవసాయ భూమిలోని బోర్‌వెల్ వద్ద ఉపాధిహామీ పనుల్లో చేపట్టిన రీచార్జ్ పనులను జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, ఎంపీడీవో సత్తయ్య మంగళవారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం మాట్లాడుతూ ఈ పనుల ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోరులో నీటి లభ్యత పెరుగుతుందన్నారు. దీంతో ఎక్కువ సేపు నీరువచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి అవకాశాలను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశీలించిన వారిలో ఏపీవో కొమురయ్య, ఉపాధిహామీ సిబ్బంది రాజు, నాగరాజు, ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్ ఉన్నారు.

డీఎంహెచ్‌వో సమావేశం



సిరిసిల్ల: కౌమార దశలో ఉన్న పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రూప్ సమావేశాలతో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నోడల్ ఆశ పర్సన్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ భేటీ బచావో.. బేటీ పడావో లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. సమావేశంలో డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌ఓ శాంత, హెచ్‌ఈ బాలయ్య, డీడియం కార్తీక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజా సంక్షేమం

సిరిసిల్లటౌన్: ప్రజా సంక్షేమ పాలన బీజేపీపీతోనే సాధ్యమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్లకు రానుండగా మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సన్నాహక సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాంప్రసాద్, పార్లమెంటు కో– కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి నవీన్ యాదవ్, రాజాసింగ్, మోర్చా అధ్యక్షులు, పట్టణ నాయకులు, బిజెపి సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ విప్ పూజలు



పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి: మండలకేంద్రంలోని శ్రీ ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి, మింజ నరసింహ స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, ఇప్ప మహేశ్, రుద్రంగి గంగపుత్ర సంఘం సభ్యులు దేశవేణి నరేశ్, భూమేశ్, వినోద్, గంగాధర్, ధర్మేందర్, గణేశ్, గంగ నర్సయ్య, గాజ నర్సయ్య, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: సీపీఎం విస్తృతస్థాయి సమావేశాల కరపత్రాన్ని మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 16న సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నెహ్రూనగర్ భవాని ఫంక్షన్‌హాల్ వద్ద జరుగుతుందని, సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ హాజరవుతారని పేర్కొన్నారు. జవ్వాజి విమల, మల్లారం అరుణ్ కుమార్, నాగరాజు, మల్లారపు ప్రశాంత్, సంపత్, సిరిమల్లె సత్యం, ఉడుత రవి, కళ్యాణ్, మనోజ్, సంధ్య, గాజుల రాజు, రాజు, సదానందం, బడుగు రాములు, వంగ సుదర్శన్, మహేశ్ పాల్గొన్నారు.

రెండోరోజు దీక్షలు

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలయ్యే వరకు ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలు వాయిదా వేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి గుండ్రేడ్డి రాజు, ఎలగందుల బిక్షపతి, రాకేశ్, బడుగు లింగయ్య, మంగళి చంద్రమౌళి, కన్నం మధు, కన్నం ప్రభాకర్, సుంకపాక శ్రావణ్, కత్తరపాక రవీందర్, కత్తరపాక మల్లయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణంలోని మండల వనరుల కేంద్రం ఎదుట, రజక సంఘం వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వేలాడుతున్న విద్యుత్ తీగలతో కాలనీ వాసులు ఆందోళనకు గురవుతున్నారు. గాలులు వీచినప్పుడు వేలాడే విద్యుత్‌తీగల నుంచి నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లూజ్ వైర్లను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : విష్ణుతేజ, ఏఈ, ముస్తాబాద్, సెల్‌నెంబర్ : 9440814079

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు, ఏఐటీయూసీ నాయకులు

వేములవాడ: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు ట్రెజరీ ద్వారా ఇవ్వాలని, వేతనాలు పెంచేవరకు తాత్కాలిక భృతి కింద రూ.4 వేలు అదనంగా ఇవ్వాలని పేర్కొంటూ మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పెంచిన వేతనంలోని 3 నెలల బకాయిలు చెల్లించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 25 లక్షలు ఇవ్వాలని, 60ఏళ్లు పైబడిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు పదవి విరమణ జరిగితే రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. రాజన్న ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుండటంతో వ్యర్థ పదార్థాలతో చెత్త విపరీతంగా పెరుగుతుందనీ, సిబ్బంది కంటే ఎక్కువ మందిని పెంచాలని కోరారు. ఇక్కడ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, నాయకులు మల్లేశం, రాజయ్య, దుర్గయ్య, మల్లయ్య, చంద్రయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో ఉత్సవ విగ్రహాలు

చందుర్తి: మండలంలోని బండపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండ్రోజులుగా స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి పుట్ట బంగారంను ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు కొండ సత్తవ్వ లక్ష్మణ్‌గౌడ్, వేద పండితులు, భక్తులు పురాతన ఆలయం వేంకటేశ్వర స్వామివారి ఆలయం వరకు తరలివెళ్లారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విక్ వర్ధనం, మృత్యజ్ఞాహణం, అంకురారోపణ, ధ్వజారోహణం, చతుస్నానార్చన, అగ్ని ప్రతిష్ఠ హోమం, పూర్ణాహుతి, ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు , మంచినీటి వసతి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ లక్ష్మణ్‌గౌడ్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఏనుగుల లచ్చిరెడ్డి తెలిపారు.

ఇసుకరీచ్‌లు ప్రారంభించండి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: గతంలో మాదిరిగానే ఎక్కడికక్కడ ప్రజలకు అందుబాటులో ఇసుక దొరికేలా రీచ్‌లు ప్రారంభించాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గ్రామాలకు ఆనుకుని మానేరువాగు వెళ్తున్నా జిల్లాలో స్థానిక అవసరాలకు ఇసుక దొరకడం లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక అవసరాలకు గతంలో మాదిరిగా ఇసుకరీచ్‌లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రామచంద్రంకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బందారపు లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు నంది నరేశ్, రావుల గాల్‌రెడ్డి, శ్రీశైలం, వంగల రాజు, కిరణ్‌నాయక్, బొమ్మెడ స్వామి, వడ్నాల భాస్కర్ పాల్గొన్నారు.

రెడ్డిల సంక్షేమానికి కృషి



ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని రెడ్డిల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెడ్డి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లు, రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో రెడ్డి సంఘం భవనాలకు నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో 34వ ర్యాంక్ సాధించిన మర్రిగడ్డకు చెందిన అఖిల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, రవి, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: ముస్తాబాద్ అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజుగురు స్వామి కోరారు. పదుల సంఖ్యలో రోగులకు ఆపరేషన్లు జరిగాయన్నారు. మాజీ సర్పంచ్ సదిమెల ఎల్లం, డాకూరి నాగరాజు, కొండ యాదగిరి, ఆనందరావు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

తంగళ్లపల్లి: సిరిసిల్ల–తంగళ్లపల్లి మానేరు వంతెనపై ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. వృద్ధుడి వివరాలు తెలియరాలేదు.